క్లుప్తంగా

పెనుమంట్ర ఇన్‌చార్జి ఏఓగా దేవీ స్వరూప



దేవీ స్వరూప

పెనుమంట్ర: పెనుమంట్ర మండల ఇన్‌ఛార్జ్ వ్యవసాయ అధికారిణిగా బి.దేవీ స్వరూప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు భీమవరం మండలం పీఓగా పనిచేసిన దేవీ స్వరూపా పదోన్నతిపై బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్ వ్యవసాయ అధికారిణిగా పనిచేసిన అడబాల జ్యోష్యుల బదిలీపై వెళ్లారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను తెలుసుకుని వారికి పని చేస్తానని ఆమె అన్నారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి



వడలిలో తాగునీటిని పరీక్షిస్తున్న ఎంపీడీఓ మూర్తి

పెనుగొండ: తాగునీటి సరఫరాలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని పెనుగొండ ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. శనివారం వడలి పంచాయతీలో తాగునీటి పరీక్షలు నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను పరిశీలిస్తుండాలన్నారు. ఎక్కడా అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తుండడం వల్ల జ్వరాల వ్యాప్తి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి చికిత్సలు



కంటి చికిత్సలు చేయించుకున్న వృద్ధులతో వాకర్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పది మంది వృద్ధులకు కంటి శస్త్ర చికిత్సలు చేయించారు. శనివారం రూ. 50 వేలతో చికిత్సలు చేయించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాల్లో వైద్యం, విద్య కోసం ఎవరైనా ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే తమ క్లబ్ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. చికిత్స అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో పెన్మెత్స సీతమ్మ స్మారక భవనంలో పీఎల్ రాజు జయంతి పురస్కరించుకుని రోగులకు, వృద్ధులకు, మెరిట్ విద్యార్థులకు పండ్లు, నగదు బహుమతి అందజేశారు. శనివారం పీఎల్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు కుమారులు గోపాలరాజు, వెంకటపతిరాజులు నగదు బహుమతులు అందజేశారు. జిన్నూరు, పాలకొల్లు పరిసర ప్రాంతాల విద్యార్థులకు 25 మందికి రూ. 5 వేలు చొప్పున ఇచ్చారు. అలాగే జెడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో 571 మార్కులు, 520 మార్కులతో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ. 10 వేలు చొప్పున అందజేశారు. ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించిన ఛాంబర్స్ కళాశాల విద్యార్థి లక్ష్మణ్‌కు రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బుద్దరాజు, సుబ్బరాజు, పెన్మెత్స గోపాలం, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడల జననం



ఆవుకు ఒకే కాన్పులో పుట్టిన లేగ దూడలు

కాళ్ల: ఆవు ఒకే కాన్పులో రెండు లేగ దూడలకు జన్మనిచ్చిన అరుదైన ఘటన కాళ్ల మండలం పెదఅమీరంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు అనే పాడి రైతు జెర్సీఆవు శనివారం ఉదయం రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. గతంలో రెండు కాన్పుల్లో ఒక్కో దూడకు జన్మనిచ్చిన ఆవు ఈసారి రెండు ఆవుదూడలకు జన్మనివ్వడం ఆనందంగా ఉందని రైతు తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు

- మార్జిన్‌లలో పేరుకుపోతున్న మట్టి
- ప్రమాదాలకు గురవుతున్న వాహనాదారులు



వెలగలవారిపాలెం వద్ద తణుకు- బ్రాహ్మణచెరువు రోడ్డులో నిలిచిన నీరు



మార్టేరు ఆటోగ్యారేజ్ వద్ద ఆచంట- కోడేరు రోడ్డు ఇలా



మార్టేరు సెంటర్‌లో కొత్తగా వేసిన పాలకొల్లు వైపు సీసీ రోడ్డు మార్జిన్



నత్తారామేశ్వరం వద్ద పెనుగొండ- సిద్ధాంతం రోడ్డు దుస్థితి

మండలంలోని చాలా రోడ్ల మార్జిన్‌లలో మట్టి పేరుకుపోతోంది. మార్టేరు- పెంటపాడు రాష్ట్ర రహదారితో పాటు జుత్తిగ మీదుగా వెళ్లే బ్రాహ్మణచెర్వు, తణుకు రోడ్డు, కత్తవపాడు మీదుగా వెళ్లే నత్తారామేశ్వరం-పెనుగొండ రోడ్డు, ఆలమూరు మీదుగా వెళ్లే లంకలకోడేరు- కానూరు రోడ్డు, పాలమూరు- పొదలాడ రోడ్ల మార్జిన్‌లతో పాటు రోడ్డు మలుపుల్లో ఇసుక, మట్టి మేటలు పేరుకుపోయాయి. అలాగే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా, ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై సిద్ధాంతం, కోడేరు గ్రామాల నుంచి ఇసుక, మట్టి రవాణా భారీగా జరిగింది. అలాగే గతేడాదిగా ఈ రోడ్ల మార్జిన్‌లలో పేరుకుపోయిన సిల్టును తొలగించకపోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వంతెనల ప్రాంతంలో అయితే ఈ పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– పెనుమంట్ర



ఆలమూరు భోగేశ్వరం డ్రెయిన్ వంతెన వద్ద స్టేట్‌హైవే రోడ్డుపై పేరుకుపోయిన మట్టి



మల్లిపూడి మలుపువద్ద జుత్తిగ- తణుకు రోడ్డు ఇలా



పెనుమంట్ర గ్రామపంచాయతీ వద్ద మార్టేరు- పెంటపాడు స్టేట్ హైవే రోడ్డు

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

ఉండి: ఈ నెల 26వ తేదీన మహదేవపట్నం ఉప్పరగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలోని బాధిత కుటుంబాలకు శనివారం తహసీల్దార్ నాగార్జున ఆధ్వర్యంలో ప్రభుత్వ సహాయాన్ని అందజేశారు. కుడిపూడి పద్మావతి, లంక అమ్మాజీ కుటుంబాలకు ప్రభుత్వం తరుపున 25 కేజీల బియ్యం, రూ.5 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనిమా నాగవెంకటసుబ్బలక్ష్మి వీఆర్వోలు ఎస్ చిన్నారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం శిక్షణ తరగతులు

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు, కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదరంగం ఆటపై నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరిగాయన్నారు. అనంతరం చదరంగం ఆటపై ఉచిత శిక్షణ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన ఇంజనీరింగ్ కార్మికుల దీక్షలు



పాలకొల్లు సెంట్రల్: కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న గుణ్ణం సర్వారావు



నరసాపురం: మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ మునిసిపల్ కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపుమేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టణ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గుణ్ణం సర్వారావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సర్వారావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న ధరలను బట్టి చాలీచాలని జీతాలతో అతి కష్టంగా ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. కార్మికులు కోరుతున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, భాషా, ఆంజనేయులు, సూర్యనాగు, కర్రా ప్రభాకర్రావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: ఎంతో కాలంగా ఉన్న పెండింగ్‌లో సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఆందోళన ఆరో రోజుకు చేరింది. శనివారం 20 మంది రిలే దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఆరు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తాము ఏమీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. చేసిన పనికి న్యాయంగా రావాల్సిన వేతనాలు ఇమ్మంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యకు వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, సీపీఐ నేతలు నెక్కంటి సుబ్బారావు, ఆరేటి మృత్యుంజయ దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కోటిపల్లి కాశీ, ఎం.రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: ఏ వ్యక్తి అభివృద్ధి చెందాలన్నా అది ఒక్క విద్యతోనే సాధ్యమవుతుందని దాత పెచ్చెట్టి చలపతిరావు అన్నారు. శనివారం పోడూరు మండలం రావిపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెన్మెత్స రామభద్రరాజు, వీరా మల్లిఖార్జునుడు, స్వర్ణసింగ్, రంగరాజు, పెచ్చెట్టి నాగేంద్ర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో

పెనుగొండ: అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తున్న పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. శనివారం ఆచంట మండలంలోని కురుగోరుమిల్లి ముత్యాల వారి పాలెం, ఆచంట చినపేట, ఆచంట పొలిమేర, ఆచంట పార, కొడమంచిలి బండివారిపాలెం, బొల్లా ప్రగడ వారి చెరువులలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం రాఘవరావు, ముత్తాబత్తుల త్రిమూర్తులు, బండి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత

భీమవరం అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. దిరుసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన యశస్వినికి రూ. 6 వేలు, దివ్యకు రూ. 5 వేలు, ఎం షీనాకు రూ. 4 వేల చొప్పున పూర్వ విద్యార్థి 1979 బ్యాచ్‌కు చెందిన చక్రపాణి అయ్యంగార్ దాతృత్వంతో అందించారు. కార్యక్రమంలో సారంగపాణి, పీవీ రమణ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి



ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి

నరసాపురం: ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయకేంద్రం ద్వారా అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ శ్రీదేవి సూచించారు. శనివారం ఆమె నరసాపురం సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కేసులు, వివరాలు ఆరా తీశారు. రిమాండ్ ఖైదీలకు నిబంధనలకు అనుగుణంగా సబ్ జైలులో సదుపాయలు ఏర్పాటు చేయాలని జైలు అధికారులను ఆదేశించారు. మంచినీటి సదుపాయం విషయంలో ప్రత్యేక శ్రనద్ధ తీసుకోవాలని చెప్పారు. ఖైదీలకు వైద్య సదుపాయాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

ఆక్వా జోనేషన్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ అప్పారి ఏడుకొండలు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామ సచివాలయంలో శనివారం ఆక్వా జోనేషన్ కార్యక్రమం పై మండల మత్స్య శాఖ అధికారులు ఆక్వా రైతులతో గ్రామ సభ నిర్వహించారు. జోన్‌లో ఉన్న పొలాలు ఆక్వా సాగుకు అనుకూలంగా ఉండడమే గాక రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే పలు అంశాలను వివరించారు. పలువురు రైతులు కొంతేరు, అడవిపాలెం గ్రామాల పరిధిలో చెరువులకు కరెంటు సబ్సిడీ రావడం లేదని చెప్పగా ఈ గ్రామాలు పాలకొల్లు పట్టణంలో విలీన అంశం కోర్టులో ఉండడం వల్ల సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్, యలమంచిలి ఎఫ్‌డీఓ అప్పారి ఏడుకొండలు, విలేజ్ ఫీషరీస్ అసిస్టెంట్ వి.నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ శిడగం శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



ఇంటి నిర్మాణానికి రేకులు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఒక్కోసారి మనం చేసే సహకారం వల్ల దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే ఓ ఉన్నతమైన వ్యక్తిగా లేదా ఓ క్రీడాకారుడుగానో తయారయ్యే అవకాశం ఉంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షులు రావాడ సతీష్ అన్నారు. శనివారం ఉల్లంపర్రు గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కోసం రోటరీ క్లబ్‌ను ఆశ్రయించిన యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన చెల్లిబోయిన పల్లారావుకు రూ. 18 వేలు విలువ గలిగే ఐరన్ రేకులు అందించామన్నారు. అలాగే ఇటీవల లాంగ్ జంప్‌లో పది నేషనల్, ఇంటర్నేషనల్ పోటీల్లో తన సత్తా చాటిన వీరవాసరం గ్రామానికి చెందిన రావాడ కుసుమ ప్రతిభను ప్రోత్సాహమిస్తూ ఆమె తల్లి దుర్గ ఆదిలక్ష్మీకి రూ. 50 వేలు నగదు అందించామన్నారు. గ్రామ దేవత వేగులమ్మ ఆలయం వద్ద గ్రామంలో రేషన్ షాపు వద్ద, రైతుల విశ్రాంతి భవనాల వద్ద విశ్రాంతి తీసుకునేందుకు సిమ్మెంట్ బల్లలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ జవ్వాజి కళ్యాణ్, ట్రెజరర్ పోతాబత్తుల సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్ మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్, యిమ్మిడి రాజేష్, కావలి నగేష్, మైగాపుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రజనీకుమార్

పాలకొల్లు సెంట్రల్: మహిళలు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కల్పించుకోవడం చాలా అవసరమని పట్టణ సీఐ కోలా రజనీకుమార్ అన్నారు. శనివారం స్థానిక బీవీఆర్ఎం మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో బాలికలు, మహిళల చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు చట్టాలను అవగాహన చేసుకోవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపుల నుంచి రక్షించుకోవాలంటే తప్పనిసరిగా చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అలాగే శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల మహిళలకు ఎలాంటి సమస్యలు వెంటనే పోలీసులను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మార్‌లింగం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ప్రభాకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పట్టణం నుంచి గ్రామానికి తరలిపోతున్న గురుకుల పాఠశాల



ప్రస్తుతం నడుస్తున్న బీసీ బాలురు గురుకుల పాఠశాల భవనం



బీసీ హాస్టల్‌ను తరలిస్తున్న కట్టుకాల్వ గ్రామంలో భవనం

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న మహాత్మాజ్యోతీబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహం (గురుకుల పాఠశాల) యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నారు. బ్రాడీపేట బైపాస్ పెనుమదం రోడ్డు జంక్షన్‌లో ఉన్న జీ-ప్లస్ ఫోర్ భవనంలో ఈ హాస్టల్ 2018లో ఏర్పాటు చేశారు. కింద గ్రౌండ్‌ఫ్లోర్‌లో వెనుక బాగంలో కిచెన్ ఏర్పాటు చేశారు. మిగిలిన పై నాలుగు ఫ్లోర్‌లు పాఠశాల, హాస్టల్‌గా ఉపయోగిస్తున్నారు. పై రెండు ఫ్లోర్‌లు పాఠశాలకు ఉపయోగించగా మిగిలిన రెండు ఫ్లోర్‌లు హాస్టల్‌కు ఉపయోగిస్తున్నారు. విద్యార్థులకు ఇక్కడ వసతులు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల రాకపోకలకు కూడా ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో విద్యార్థులు సుమారు 180 మంది ఉన్నారు. ప్రస్తుతానికి నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఉంది కాబట్టి 140 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

భవన యజమాని ఖాళీ చేయమనడంతో..

ఈ భవనంలో 5 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థుల వసతితో పాటు పాఠశాలను కూడా నిర్వహిస్తున్నారు. అయితే భవనం యజమాని భవనాన్ని ఖాళీ చేయాలని ఆదేశించడంతో ఇక్కడ నుంచి గురుకుల పాఠశాలను యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నారు. కట్టుకాల్వ లో జీప్లస్ టు భవనంలోకి గురుకుల పాఠశాలను మారుస్తున్నారు. గతంలో ఈ భవనంలో ఓ ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెపుతున్నారు. పట్టణంలో ఉన్న భవనానికి ఇప్పటివరకూ నెలకు రూ. 1.80 లక్షలు అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కట్టుకాల్వలో తీసుకున్న భవనానికి సుమారు రూ.1.20 లక్షలు వరకూ అద్దె ఉంటుందని అంటున్నారు. పల్లె నుండి చదువులు, వ్యాపారాలు నిమిత్తం ప్రజలు, విద్యార్థులు పట్టణానికి వస్తుంటే పట్టణంలో ఉన్న గురుకుల విద్యాభ్యాసం పల్లెకు పోతుండడం ఒకింత పట్టణవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ముఖ్యంగా సెలవుల సమయంలో రాకపోకలకు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది.

జూన్ 30 నుంచి కొత్త భవనంలో..



హాస్టల్ భవనం మేము ఖాళీ చేయాలన్నా లేదా యజమాని మమ్మల్ని ఖాళీ చేయించాలన్నా రెండు నెలలు ముందుగా చెప్పాలనే షరతులు ఉన్నాయి. ఆ ప్రకారం భవన యజమాని రెండు నెలలు ముందుగానే ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. అందువల్ల జూన్ 30లోపు భవనం ఖాళీ చేయాల్సి ఉంది. యలమంచిలి మండలం కట్టుకాల్వలోని జిప్లస్ టు భవనంలోకి ఈ హాస్టల్‌ను మారుస్తున్నాం. పట్టణంలో ఇంత అనుకూలమైన భవనం అందుబాటులో లేకపోవడం వల్ల యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామానికి తరలిస్తున్నాం.

– డి.ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాల, పాలకొల్లు